
సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 29 । మే । 2023



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చలసాని మాలిని (విశాఖపట్నం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ మేరకు చెక్కును ఏఈఓ కృష్ణారావుకు ఆమె బంధువు రాధాకృష్ణ అందజేశారు.



కడలిలోకి 10,689 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 10,689 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం

42.5° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.0	27.0
కాకినాడ	36.0	28.5
అమలాపురం	42.5	27.0

న్యూస్‌రీల్

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. దీనికి ఆయా విద్యార్థులు హాజరు కావాలని పాలిసెట్ కన్వీనర్, ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ముందుగా polycetap. nic. in ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, ఆ రశీదు తీసుకుని కౌన్సెలింగ్‌కు రావాలని సూచించారు. ప్రాసెసింగ్ ఫీజు రశీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మెమో, 4 నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఓసీ అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీ ఒరిజినల్ పత్రాలు, 3 సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని వివరించారు. సోమవారం 1 నుంచి 12 వేల ర్యాంకు వరకూ, 30న 12,001 నుంచి 28 వేల వరకూ, 31న 28,001 నుంచి 43 వేల వరకూ, జూన్ 1న 43,001 నుంచి 58 వేల వరకూ, 2న 58,001 నుంచి 74 వేల వరకూ, 3న 74,001 నుంచి 91 వేల వరకూ, 4న 91,001 నుంచి 1,08,000 వరకూ, 5న 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 1 నుంచి 6వతేదీ వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని, 9న సీట్ అలాట్‌మెంట్ జరుగుతుందని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు వెల్లడించారు.

లోవకు పోటెత్తిన భక్తులు



లోవ దేవస్థానంలో కిక్కిరిసిన భక్తజనం

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు. క్యూ లైన్ల ద్వారా 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రవ్వలడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,45,470, పూజా టికెట్లకు రూ.1,35,210, తలనీలాలకు రూ.15,075, వాహన పూజలకు రూ.4,090, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.73,700, విరాళాలుగా రూ.1,21,626 కలిపి మొత్తం రూ.4,91,171 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లలో అరగంట, ఉచిత దర్శనాలకు గంటపాటు భక్తులు వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం అధీనంలో ఉన్న వసతి గదులు లభించని భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఉచిత షెడ్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన మామిడి, జీడిమామిడి తోటల్లో వసతి ఏర్పాటు చేసుకుని, వంటలు, భోజనాలు చేశారు. భక్తుల ఏర్పాట్లను చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులతో కలసి ఈఓ పర్యవేక్షించారు.

సంక్షేమ పథకాలను కించపరచడం తగదు

- ఇలా మాట్లాడితే ఈ మహానాడే టీడీపీకి అంతిమ సంస్మరణ సభ
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

రాజానగరం: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కించపరిచేలా మాట్లాడటం టీడీపీ అధినేత చంద్రబాబుకు తగదని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హితవు పలికారు. ఇటువంటి వ్యాఖ్యల వలన ఆయన ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడే ఆ పార్టీకి అంతిమ సంస్మరణ సభ అవుతుందనే విషయం గ్రహించలేకపోతున్నారని అన్నారు. రాజా ఆదివారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నిర్వహిస్తున్న టీడీపీ మహానాడులో చంద్రబాబు రెండు రోజులుగా మొసలి కన్నీరు కారుస్తున్నా జనం పట్టించుకోవడం లేదని అన్నారు. నాలుగేళ్లుగా అడ్రస్ లేకుండా ఉన్న టీడీపీకి జీవం పోసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై చంద్రబాబు అండ్ కో లేనిపోని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సొంత మామను వెన్నుపోటు పొడిచి, అధికారం హస్తగతం చేసుకోవడమే కాకుండా.. ఆయన మరణానికి కూడా కారకులైన వారు నిస్సిగ్గుగా శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం శోచనీయమని అన్నారు. వెన్నుపోటుతో ముఖ్యమంత్రి పదవిని కొట్టేసిన చంద్రబాబుకు.. దేశంలోనే అత్యంత శక్తిమంతురాలిగా ఉన్న సోనియాగాంధీని సైతం ఎదిరించి, సొంతంగా పార్టీ పెట్టి, ప్రజల అండదండలతో భారీ మెజార్టీతో ముఖ్యమంత్రి అయిన జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య.. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని రాజా అన్నారు. మహానాడుకు వచ్చిన సాధారణ కార్యకర్తలను గాలికొదిలేసి, ఎన్ఆర్ఐలకు స్టార్ హోటల్స్‌లో విందు సమావేశాలు ఏర్పాటు చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. విరాళాల పేరుతో వారి నుంచి వందల కోట్లు దండుకోవడమే అజెండాగా ఆయన తీరు ఉందని.. దీనికి భిన్నంగా రాష్ట్రంలో ప్రజలంతా బాగుండాలి, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ప్రధాన అజెండాతో సీఎం జగన్ ఉన్నారని, తద్వారా ప్రజాదరణ పొందుతున్నారని చెప్పారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా చంద్రబాబు ఏనాటికీ ప్రజాకోర్టులో విజేత కాలేరని అన్నారు. టీడీపీ పెద్దల అక్రమ సంపాదనలకు అడ్డాగా ఉన్న అమరావతిలో.. పేదలకు నివాస స్థలాలు కేటాయించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. అందువల్లనే చంద్రబాబు ఆ ఇంటి స్థలాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, తనలోని రాక్షస మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారని రాజా అన్నారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది



ఎండకు తాళలేకపందిరి కింద సేద తీరుతున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని ఆలయం ఆదివారం కూడా భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 2 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.35 లక్షల ఆదాయం లభించింది. పగలంతా 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఎండతో రత్నగిరి నిప్పుల గుండాన్ని తలపించింది. అటువంటిది సాయంత్రం 4 గంటల నుంచి దట్టమైన మబ్బులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురవడంతో ఆలయ ప్రాంగణం చల్లపడింది. దీంతో భక్తులు, అన్నవరం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నో పరేషన్

- వేలిముద్రలు అరిగిపోయిన వారికి ఊరట
- రేషన్ పంపిణీలో నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- వేలిముద్రలు పడకపోయినా సరకులు అందేలా ఏర్పాట్లు
- ఐరిస్ ద్వారా పొందే వెసులుబాటు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చింది. రేషన్ సరకులు తీసుకోవాలంటే చౌకదుకాణాల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి చూసే పరిస్థితికి చెక్ పెట్టింది. వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందిస్తోంది. ఈ క్రమంలో మరో సంస్కరణకు తాజాగా నాంది పలికింది. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, చక్కెర, కంది పప్పు పొందడానికి బయోమెట్రిక్ (వేలిముద్రలు) విధానం అమలు చేస్తున్నారు. వేలిముద్రలు ఆధారంగానే కార్డుదారులకు ప్రతి నెలా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మంది లబ్ధిదారుల్లో ముఖ్యంగా మహిళలు, ఇంటి పనులు చేసేవారు, కూలి పనులకు వెళ్లేవారు, వృద్ధుల్లో వేలిముద్రలు పడక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరికి వేలిముద్రల్లో రేఖలు అరిగిపోవడంతో బయోమెట్రిక్ పడటం లేదు.

ఐరిస్‌తో పరిష్కారం

ఈ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. రేషన్ సరకుల పంపిణీకి బయోమెట్రిక్‌తో పాటు ఐరిస్ (కంటి గుర్తింపు) విధానాన్ని అమలులోకి తీసుకువచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల నుంచి ఈ రెండు విధానాల్లోనూ రేషన్ పంపిణీ చేయనున్నారు. అవసరమైన ఐరిస్ పరికరాలను పౌర సరఫరాల శాఖ జిల్లా యంత్రాంగం అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలోని 364 ఎండీయూ (రేషన్ వాహనాలు) ఆపరేటర్లకు వీటిని అందజేస్తున్నారు. వేలిముద్రల ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల ఐరిస్ సేకరించి, పరికరంలో ఫీడ్ చేస్తారు. వేలిముద్రలు పడకపోతే ఐరిస్ ఆధారంగా రేషన్ సరకులు పంపిణీ చేస్తారు.

రేషన్ వివరాలు

మొత్తం రేషన్ కార్డులు :	5,64,571
మొబైల్ డిస్పెన్సింగ్ వాహనాలు :	364
ప్రతి నెలా పంపిణీ చేస్తున్న బియ్యం :	8,000 మెట్రిక్ టన్నులు



ఐరిస్ యూనిట్ అందజేస్తున్న జేసీ తేజ్‌భరత్

స్పందించిన సీఎం వైఎస్ జగన్

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ సోమవారం స్పందన కార్యక్రమాల్లో ప్రజా సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తున్నారు. వీటిలో అత్యధిక శాతం రేషన్‌కు బయోమెట్రిక్ పడటం లేదన్న సమస్యలే అధికంగా వస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. దీంతో లబ్ధిదారుల కష్టాలు తీర్చేదిశగా అడుగులు వేశారు. దీనికి పరిష్కారం అన్వేషించి న్యాయం చేయాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఐరిస్ ద్వారా సరకుల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వచ్చే నెల నుంచి ఈ ప్రక్రియ అమలులోకి రానుంది.

అర్హులకు రేషన్ అందాలన్నదే లక్ష్యం

అర్హులైన ప్రతి లబ్ధిదారుకూ రేషన్ అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. వేళ్లు అరిగిపోవడం ద్వారా రేషన్ పొందేందుకు పడుతున్న అవస్థలను గుర్తించిన ప్రభుత్వం ఐరిస్ ప్రక్రియకు నాంది పలికింది. తద్వారా వేలిముద్రల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఐరిస్ పరికరాల పంపిణీ ఇప్పటికే ప్రారంభించాం. త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

జిల్లావ్యాప్తంగా ఐరిస్ యంత్రాల వివరాలు

మండలం	కేటాయించిన యంత్రాలు
రాజమహేంద్రవరం అర్బన్	58
రాజమహేంద్రవరం రూరల్	30
కడియం	21
రాజానగరం	24
సీతానగరం	16
కోరుకొండ	18
గోకవరం	16
రంగంపేట	13
అనపర్తి	14
బిక్కవోలు	14
చాగల్లు	12
దేవరపల్లి	17
గోపాలపురం	12
ఉండ్రాజవరం	15
నిడదవోలు	21
తాళ్లపూడి	11
కొవ్వూరు	21
పెరవలి	15
నల్లజర్ల	16

వాయువేగం.. అతలాకుతలం

- విరిగిపడిన చెట్లు
- నేల కూలిన 272కు పైగా విద్యుత్ స్తంభాలు
- 267 ఫీడర్లలో సరఫరాకు అంతరాయం
- గంటల తరబడి నిలిచిపోయిన విద్యుత్
- యుద్ధప్రాతిపదిక పునరుద్ధరణ పనులు

కొవ్వూరు: అసలే గ్రీష్మ రుతువు.. అందునా రోహిణీ కార్తె కావడంతో సూర్యుడు పగటి వేళ చండప్రచండంగా ప్రతాపం చూపిస్తున్నాడు. నింగి నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెల్సియస్ మాత్రమే నమోదైనప్పటికీ 49 డిగ్రీలు అన్నంత స్థాయిలో ఉష్ణతాపం ఉంది. వడగాలులు వీచాయి. దీంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. సాయంత్రం 4 గంటల వరకూ ఇదే పరిస్థితి కొనసాగగా.. ఆ తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురు గాలు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి కుండపోతగా భారీ వర్షం కురిసింది.

స్తంభించిన జనజీవనం

బీభత్సంగా వీచిన గాలులు అరగంట వ్యవధిలోనే జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. అరటి పంటకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఎక్కడికక్కడే స్తంభాలు కూలిపోవడం, చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడి వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా కొవ్వూరు, చాగల్లు, పెరవలి, తాళ్లపూడి, నిడదవోలు, గోపాలపురం, దేవరపల్లి, రాజానగరం, కడియం, కోరుకొండ, సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో నష్టం అధికంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. రాత్రి ఏ సమయమైనప్పటికీ సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఏపీ ఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఈఈ పి.అచ్యుతాచారి తెలిపారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం 272 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 68 ట్రాన్స్‌ఫార్మర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా 272 ఫీడర్లకు నిలిచిపోయింది. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని కోరుకొండ, సీతానగరం మండలాల్లో ఈదురు గాలుల తీవ్రత అధికంగా ఉందని అధికారులు చెబుతున్నారు. తొర్రేడు వద్ద భారీ వృక్షం నేలకూలి, విద్యుత్ వైర్లపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడియంలో ఆరు స్తంభాలు కూలిపోయాయి. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్‌లో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరం డివిజన్‌లో 120 స్తంభాల వరకూ నేలకూలినట్టు అధికారులు గుర్తించారు. ఎనిమిది 11 కేవీ ఫీడర్లలో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒక్క నిడదవోలు డివిజన్ పరిధిలోనే 152 స్తంభాలు కూలిపోయాయి. 52 ట్రాన్స్‌ఫార్మర్లకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. 33 కేవీ 24 ఫీడర్లు, 11 కేవీ 235 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఒక్కో ప్రాంతానికి సరఫరా పునరుద్ధరిస్తున్నారు.



గోపాలపురం - కొయ్యలగూడెం రోడ్డులో చెట్లు విరిగి పడటంతో నిలిచిపోయిన వాహనాలు



దేవరపల్లిలో భారీ వర్షం



కొవ్వూరు మండలం కాపవరంలో ఇంటి గేటుపై కూలిన విద్యుత్ స్తంభం



కాపవరంలో విరిగి పడిన చెట్టు, విద్యుత్ స్తంభం



ఆవకాయ కోసం మామిడి కాయలను కోస్తున్న గ్రామస్తులు



మామిడికాయ ముక్కలు నరుకుతున్న మహిళలు



ఉసులుమర్రులో ఆవకాయ తయారీ

ఆ ఊరు గాయంటే స్పెషలే మరి



- పచ్చళ్ల తయారీకి పెట్టింది పేరు
- ఊరిలో చాలా మందికి ఇదే ఉపాధి
- దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయం

పెరవలి: ఏప్రిల్, మే నెలలు వచ్చాయంటే అందరికీ ఎండలు గుర్తుకు వస్తాయి. కానీ ఆ ఊరి వారికి ఊరగాయ గుర్తుకు వస్తుంది. ఊళ్లో దాదాపు సగానికి పైగా ఆవకాయ తయారీ మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలోకి అడుగుపెడితే పచ్చళ్ల వాసనలను ఆఘ్రాణించవచ్చు. గతంలో బతుకుతెరువు కోసం ప్రారంభించిన ఈ చిరు వ్యాపారం నేడు వందల మందికి ఉపాధి కల్పిస్తోంది. గ్రామంలో 2,400 జనాభా ఉంది. వీరిలో 1,600 మంది పచ్చళ్లపై ఆధారపడి బతుకుతున్నారు. వేసవిలో మామిడి కాయతో ఆవకాయ తయారీలో వీరు బిజీగా ఉంటారు. ఏడాది పొడవునా ఏదో ఒక ఊరగాయ తయారు చేస్తూనే ఉంటారు. ప్రతి ఇల్లూ ఓ కుటీర పరిశ్రమలా కోలాహలంగా కనిపిస్తుంది.

తయారీలో అందరూ బిజీ

చిన్నాపెద్దా ఆడామగా అనే తేడా ఉండదు. ఇంటిల్లిపాదీ కష్టపడుతూంటారు. ఊరగాయలు తయారయ్యాక పురుషులు దూర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. ఇంటి వద్ద ఊరగాయల తయారీలో మహిళలది కీలక పాత్ర. సీజన్ ప్రకారం టమాటా, ఉసిరి, అల్లం, మాగాయ, ఆవకాయ, గోంగూర, కాలీఫ్లవర్, పండుమిరప, నిమ్మ, దబ్బ, కాకర వంటి పచ్చళ్లు తయారు చేస్తూంటామని గ్రామానికి చెందిన ముత్యాల రామాంజనేయులు చెప్పారు. ఈ వ్యాపారానికి తొలి నుంచీ అలవాటు పడిపోయామని వెంకటేశ్వరరావు అన్నారు.

ఎందరికో ఉపాధి

ఉసులుమర్రు వ్యవసాయాధారిత గ్రామం. ఇక్కడ వరి పండిస్తూంటారు. జూన్, జూలై, డిసెంబర్, జనవరి నెలల్లో వ్యవసాయ పనులు చూసుకుంటారు. మిగిలిన సమయంలో ఊరగాయలు తయారు చేస్తూ దీనినే జీవనోపాధిగా మార్చుకుంటారు. ఊరగాయల సీజన్‌లో మహిళలకు రోజుకు రూ.300, మగవారికి రూ.450 చొప్పున కూలి ఇస్తున్నారు. గ్రామంలో 80 శాతం మహిళలకు ఊరగాయల పనులతో ఊపిరి సలపదని కూనపురెడ్డి సత్యవతి చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రకాల ఊరగాయలూ చేయాలంటే రూ.3 లక్షల వరకూ పెట్టుబడి అవసరమవుతుందని గ్రామస్తులు చెప్పారు. అన్నీ బాగుంటే ఖర్చులు పోనూ రూ.40 వేల నుంచి రూ.50 వేలు మిగులుతాయంటున్నారు. ప్రైవేటు అప్పులు తెచ్చుకుంటున్నామని, బ్యాంకులు సహకారం అందించాలని కోరుతున్నారు.

ముడిసరకు ధర పెరిగింది

పచ్చళ్ల వ్యాపారంలోనూ ఆటుపోట్లు ఉంటున్నాయని కొందరు చెప్పారు. నాణ్యతే తమ వ్యాపార విజయానికి ముఖ్యసూత్రమని అంటున్నారు. జిల్లాకే పరిమితం కాకుండా బోధన్, హైదరాబాద్, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, తిరుపతి, ఒంగోలు, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో వ్యాపారం చేస్తున్నామని ఇక్కడి వ్యాపారులు తెలిపారు. ఏడాదిలో 10 నెలలు ఇతర ప్రాంతాల్లోనే ఉంటున్నామని ఒక వర్తకుడు చెప్పారు. డ్రమ్ము పచ్చడి తయారీకి గతంలో రూ.10 వేలు సరిపోయేది. ముడిసరకు ధర పెరగడంతో రూ.25 వేల వరకూ ఖర్చవుతోందని మహిళలు అంటున్నారు. నాణ్యతను బట్టి కిలో చింతపండు రూ.120 నుంచి రూ.140 వరకూ ఉందని, పండుమిర్చి గతంలో కిలో రూ.50 ఉంటే ఇప్పుడు రూ.150 ఉందని చెబుతున్నారు. కిలో ఊరగాయ తయారీకి రూ.180 ఖర్చవుతోందని తెలిపారు.

బ్యాంకుల సహకారమేదీ!



20 ఏళ్ల క్రితం మా నాన్న ప్రారంభించిన పచ్చళ్ల వ్యాపారం ఇప్పటికీ కొనసాగిస్తున్నాం. ఏడాదిలో 10 నెలలు ఇతర జిల్లాల్లో ఉంటాం. భార్యాబిడ్డలు ఇక్కడే ఉంటారు. బ్యాంకుల సహకారం ఏమాత్రం ఉండటం లేదు. ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తోంది.

– కొమ్మర వెంకటేశ్వరావు, ఉసులుమర్రు

దూర ప్రాంతాలకు వెళ్తున్నాం



కుటుంబమంతా పచ్చళ్ల తయారీ పైనే ఆధారపడ్డాం. పచ్చళ్లు తయారు చేసి, వ్యాపారం కోసం మా ఆయనతో పాటు దూర ప్రాంతాలకు వెళ్తున్నాం. కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు. కానీ ఆస్తులు మాత్రం ఏమీ లేవు. బ్యాంకులు సహకరిస్తే బాగుండేది.

– పువ్వుల అనంతలక్ష్మి, పచ్చడి వ్యాపారి, ఉసులుమర్రు



నిమ్మకాయ ఊరగాయ తయారు చేస్తున్న మహిళ

క్లుప్తంగా

ఏవో, ఈవో పీఆర్ అండ్ ఆర్డీలకు పదోన్నతులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్స్, ఈవో పీఆర్ అండ్ ఆర్డీలకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇద్దరు, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి ఒక్కొక్కరు ఏవోలను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఒకరు, అనకాపల్లి నుంచి ఇద్దరు, శ్రీకాకుళం, ఏఎస్ఆర్ జిల్లా నుంచి ఒకరు ఈవోపీఆర్అండ్ ఆర్డీలను కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లాకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ముగ్గురు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఒక ఏవోను, కాకినాడ నుంచి ముగ్గురు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈవోపీఆర్అంఆర్డీలను బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ ఒక్కొక్క ఈవోపీఆర్అండ్ఆర్డీలను, ఒక ఏవోను బదిలీ చేశారు. ఏఎస్ఆర్ జిల్లాకు అనకాపల్లి నుంచి ఒక ఈవోపీఆర్ అండ్ ఆర్డీ, శ్రీకాకుళం నుంచి ఒక ఏవోను బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఏవోలలో ముగ్గురిని పశ్చిమ గోదావరి జిల్లాకు, ఒకరిని అనకాపల్లి జిల్లాకు పదోన్నతిపై బదిలీ చేశారు.

చికిత్స పొందుతూ ఆశా వలంటీర్ మృతి


నాగమణి

కాజులూరు: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న పల్లిపాలెం ఆశా వలంటీర్ మాసగిరి నాగమణి (45) చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగమణి శుక్రవారం విధులు నిర్వహించుకుని ఇంటికి తిరిగివచ్చి అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. కుటుంబీకులు గమనించి యానాం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి ఆమె మృతి చెందారు. హై బీపీ, కిడ్నీ సమస్యల కారణంగా నాగమణి కోమాస్థితికి చేరుకుని మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగమణి 15 సంవత్సరాలుగా గ్రామంలో ఆశా వలంటీర్‌గా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు నాదస్వర పాఠశాల ప్రారంభం

అంబాజీపేట: కంచికామకోటి పీఠం 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో శ్రీ కంచి కామకోటి నాదస్వర పాఠశాలను ముక్కామలలో సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాదస్వర పాఠశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు (9948770107, 9666551066) నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముందుకొస్తున్న సముద్రం

- అంతుచిక్కని భౌగోళిక మార్పులతో అంతర్వేది తీరం
- సాగర సంగమ ప్రదేశం కావడమే కారణం
- తీరం కోత నివారణకు రూ.67 కోట్లతో ప్రతిపాదనలు


పల్లిపాలెంలో రివిట్‌మెంట్ దాటుకుని వస్తున్న గోదావరి కెరటాలు (ఫైల్)


అంతర్వేది బీచ్‌లో శాశ్వత కట్టడాల వద్ద పోటెత్తిన కడలి కెరటాలు (ఫైల్)

సఖినేటిపల్లి: అంతుచిక్కని భౌగోళిక మార్పులతో అంతర్వేది వద్ద సముద్రం తీరం వైపునకు పోటెత్తుతున్న తీరుకు తీర ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో పోటెత్తే సముద్రం, సాధారణ రోజుల్లో కూడా తీరం వైపునకు పోటెత్తుతుండడం కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని వారు చెబుతున్నారు. ఊహించని స్థాయిల్లో వస్తున్న ఈ మార్పులతో ఎటువంటి ప్రమాదం పొంచి ఉందోనన్న భయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. సాగర సంగమంకు అత్యంత సమీపంలోని పల్లిపాలెం గ్రామస్తులు దీనిపై భీతిల్లుతున్నారు.

ఇతర ప్రాంతాలకు భిన్నంగా..

రాజోలు దీవిలోని కరవాక, కేశనపల్లి, చింతలమోరి తదితర ప్రాంతాల్లోని సముద్ర తీరాలకు భిన్నంగా అంతర్వేది వద్ద తీరం మారిందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే అలజడిగా ఉండే సముద్రం, అంతర్వేది వద్ద మాత్రం సాధారణ రోజులలో కూడా ఉరకలు వేస్తూ తీరం వైపునకు చొచ్చుకుని వస్తోందంటున్నారు.

కారణాలు ఇవే...

- గోదావరి, సాగరం సంగమం ప్రదేశం కావడం వల్ల సాధారణ రోజుల్లోనూ రాజోలు దీవిలో ఉప్పునీరు పోటెత్తుతోంది.
- సముద్రం నీరు గోదావరి వైపునకు పోటెత్తడం, ఎగువ ప్రాంతాల నుంచి అంతర్వేదికి చేరే గోదావరి నీటి ప్రవాహం తోడవ్వడంతో ఇక్కడ నీటి మట్టం రెట్టింపు అవుతోంది.
- సముద్ర గర్భంలో వచ్చే మార్పులకు నీరు బిగొపెట్టడంతో (సంగమం వద్ద గోదావరి నీరు సముద్రంలోకి రానీయకుండా) గోదావరి ప్రవాహం దిశ మళ్లి సమీప సరుగుడు తోటలను ముంచెత్తుతోంది.
- విపత్తుల సమయాల్లో, భౌగోళికంగా వచ్చే మార్పుల వల్ల సంగమంకు పడమర వైపు బియ్యపుతిప్ప వద్ద ఇసుక దిబ్బలు ఏర్పడుతున్నాయి. దీంతో కెరటాల ఉధృతి ప్రభావం సంగమంకు తూర్పు వైపు అంతర్వేది, పల్లిపాలెం తీరంపై పడుతోంది.
- అంతర్వేది లైట్‌హౌస్ వద్ద తీరం మలుపు తిరిగి ఉండడంతో తూర్పువైపునున్న అంతర్వేది వద్ద నీటి ప్రవాహ వేగం తీవ్రంగా ఉండి ఉప్పునీరు చొచ్చుకు వస్తోంది.
- 2001, 2008లో పల్లిపాలెం గ్రామ రక్షణకు గోదావరిలో నిర్మించిన గ్రోయన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ కోత కారణంగా దెబ్బతిన్నాయి. దీంతో పోటు నీరు అడ్డుఅదుపూ లేకుండా పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతోంది.
- గతానికి ఇప్పటికీ సముద్రం సుమారు 500 మీటర్లు ముందుకు చొచ్చుకు రావడంతో తరచూ పోటు సమయంలో సమీప ప్రాంతాల్లో సముద్రం ఉగ్రరూపం ప్రదర్శిస్తోంది.
- కోత కారణంగా కొద్ది సంవత్సరాలుగా సుమారు 500 ఎకరాల్లో సరుగుడు తోటలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గ్రాంటుకు వినతి



పల్లిపాలెం రక్షణకు, అంతర్వేదిలో సాగర తీరం కోత నివారణకు రివిట్‌మెంట్, సిమెంటు గోడ నిర్మాణానికి రూ.67 కోట్ల అంచనాతో ఇటీవల ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గ్రాంటు మంజూరు చేయాలని కోరాం.

– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

రూటు మారుస్తున్న కేటుగాళ్లు

- ముందుగా డబ్బులు పంపి.. ఆ తరువాత వేధింపులు
- సరి కొత్త పంథాలో బెదిరింపులు

కడియం: లోన్ యాప్ వలలో చిక్కుకున్న వారిని నానా రకాలుగా వేధిస్తున్న కేటుగాళ్లు ఇప్పుడు రూటు మారుస్తున్నారు. అడక్కుండానే ముందుగా కొంత డబ్బులు పంపి ఆ తరువాత వేధింపులు మొదలు పెడుతున్నారు. కడియం మండలానికి చెందిన దేవి దిశ యాప్‌ను ఆశ్రయించడంతో ఈ కొత్త తరహా మోసం వెలుగుచూసింది. దిశ స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవికి ఒక గుర్తు తెలియని నంబరు నుంచి రూ.2 వేలు డబ్బులు వచ్చాయి. అయితే పొరపాటున వచ్చి ఉంటాయని భావించి, ఆ డబ్బులను తిరిగి వెనక్కి పంపించి వేసింది. కొన్ని రోజులుగా అదే నంబరు నుంచి హిందీ, ఇంగ్లిషులో ఒక వ్యక్తి మాట్లాడుతూ వేధింపులు మొదలు పెట్టాడు. ఇంకా డబ్బులు పంపించాలని, లేకపోతే న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించడం ప్రారంభించాడు. ఆ వ్యక్తి మార్ఫింగ్ చేసిన న్యూడ్ ఫొటోలను పంపించడం మొదలు పెట్టాడు. ఈ బెదిరింపులు శృతి మించడంతో దిశ పోలీస్‌లకు ఫోన్ చేసి తన బాధను చెప్పుకుంది. దేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు ఆగంతకుడు ఫోన్ చేసిన నంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తులు బెదిరింపులకు దిగితే దిశకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. గతంలో అప్పు తీసుకున్న వారిని మాత్రమే వేధించేవారని, కానీ ఇప్పుడు ఇలాంటి మోసాలకు కూడా తెగబడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్న ట్యాంకర్, టిప్పర్
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


లారీ క్యాబిన్ నుంచి ఎగసి పడుతున్న మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు బలంగా ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పెను ప్రమాదం త్రుటిలో తప్పిన ఘటన ఆదివారం అర్ధరాత్రి పెద్దాపురం ఏడీబీ రోడ్డులో చోటు చేసుకుంది. పెద్దాపురం పోలీసుల కథనం ప్రకారం మహారాష్ట్ర నుంచి కాకినాడకు వెళుతున్న ట్యాంకర్‌ను స్థానిక పాండవుల మెట్ట వద్ద జంక్షన్‌లో పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న టిప్పర్ బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంక్ పగిలి మంటలు వ్యాపించాయి. రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ఈ ప్రమాదంలో ఎదురుగా ఉన్న ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా ఘటన జరిగిన ట్యాంకర్‌లో 30 వేల లీటర్ల ఇథనాల్ ఉంది. ట్యాంకర్‌కు నిప్పంటుకోకుండా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలేశ్వరంలో యువకుడి దారుణ హత్య

కారుతో తొక్కించి చంపిన స్నేహితుడు


మణికంఠ (ఫైల్)

ఏలేశ్వరం: స్నేహితుడే కాలయముడయ్యాడు. నిత్యం కలిసి తిరుగుతూ ఉన్న స్నేహితుడే కారుతో తొక్కించి కర్కశంగా తుది ముట్టించిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. ఈ ఘటనలో పట్టణానికి చెందిన కోరాడ మణికంఠ(23) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కోరాడ మణికంఠ, బంటు దుర్గాప్రసాద్ స్నేహితులు. అర్ధరాత్రి 11, 12 గంటల మధ్య దుర్గాప్రసాద్ కారులో మణికంఠను బయటికి తీసుకువెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి తెల్లవారుజామున నాలుగు గంటలకు మణికంఠ తండ్రి శ్రీనివాసరావు బంధువులతో కలిసి వెతికాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగా కారులో బయటకు వస్తున్న దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. దీంతో మణికంఠ తన తాతను తిట్టాడని దీనిపై నిలదీయగా నువ్వు ఊరిలో లేనప్పుడు నీ పెళ్లాం, పిల్లల పీకలు కోస్తానని చెప్పడంతో కారుతో తొక్కించి చంపేశానని దుర్గాప్రసాద్ చెప్పాడు. దీంతో మృతుడు తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా సీఐ కిషోర్‌బాబు, ఎస్సై సతీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

నేడు నిధి ఆప్‌కే నికత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని జిల్లాల్లో సోమవారం నిధిఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సహాయ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కడియం ఎంఆర్‌పాలెంలోని ఆంధ్రపేపరుమిల్లు లిమిటెడ్ వద్ద, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద, కాకినాడ జిల్లాలో ఎన్ఎఫ్‌సీఎల్ వద్ద నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్‌లు హాజరై తమ ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.


రావులపాలెం - అమలాపురం రహదారిలో పరచుకున్న పచ్చదనం


సరికొత్త అందాలతో తురాయి చెట్టు

ఎర్రటి ఎండలో పచ్చటి పందిరి!

కోనసీమ పచ్చదనానికి, పచ్చని పంటలకు పెట్టింది పేరు. ప్రస్తుతం మండు వేసవికాలంలో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరి వడగాడ్పులు వీస్తున్నాయి. అయినా ఈ ప్రాంతంలో పచ్చదనం ఎక్కడా చెక్కు చెదరలేదు. మండుటెండలో ప్రయాణించే వాహనదారులను రహదారులకు ఇరువైపులా కొత్త అందాలతో కొలువుదీరిన వృక్షాలు స్వాగతిస్తున్నాయి. మధ్యలో ఎర్రటి పుష్పాలతో తురాయి చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ వృక్షాల వయ్యారాలను కోనసీమ ముఖద్వారం రావులపాలెం నుంచి అమలాపురం వెళ్లే రహదారి పొడవునా చూడవచ్చు. కోనసీమకు వచ్చే వివిధ ప్రాంతాల వారిని ఇవి విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

– కొత్తపేట

రైల్వే విద్యుత్తు లైనుపై పడిన చెట్లు

- విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లకు అంతరాయం
- హుటాహుటిన తొలగించిన రైల్వే సిబ్బంది


సామర్లకోటలో తెగి పోయిన విద్యుత్తు వైర్లను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

సామర్లకోట: తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట గాంధీచౌక్ వద్ద రైల్వే విద్యుత్తు వైర్లపై చెట్లు విరిగి పడటంతో విశాఖపట్నం వైపు వెళ్లే రెండు రైళ్లు అరగంట నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం వచ్చింది. ఆ సమయంలో పిల్లకాలువ అవతలివైపు ఉన్న బూరుగుచెట్లు విరిగి రైల్వే విద్యుత్తు లైన్లపై పడ్డాయి. దాంతో విద్యుత్తు వైర్ల వద్ద మంటలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. రైల్వే విద్యుత్తు ప్రధాన లైను వైర్లు తెగిపోయాయి. దాంతో విశాఖపట్నం వైపు వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను సామర్లకోట స్టేషన్‌లోనూ, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను మేడపాడు స్టేషన్‌లోనూ అరగంట పాటు నిలిపి వేశారు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఏడీఈఎన్ శివప్రసాద్, ఎలక్ట్రికల్ సీనియర్ సెక్షన్ ఇంజినీరు లోవరాజు, పీడబ్ల్యూ దాసరి రవిశంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోషకుమార్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. తమ సిబ్బందితో చెట్లను తొలగించి, తెగిపోయిన వైర్లకు మరమ్మతులు చేసి రైళ్లను పునరుద్ధరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

పొలం అమ్మకం
ఆంధ్రప్రదేశ్, ప.గో. జిల్లాలో తాడేపల్లిగూడెం మున్సిపల్ పరిధిలో N.H-16 హైవేకి 500 మీటర్లు, NIT కి 1.5 కి.మీ. దూరంలో వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వీలైన, Collateral కి అనువైన సుమారు 25 ఎకరముల పొలం అమ్మకం.
94912 44457

PLOT FOR SALE
■ రాజమండ్రి నియర్ తిలక్ రోడ్ ప్రశాంతి ఎస్టేట్ 529 Sq.yards (50x95) సౌత్ ఫేసింగ్ DTCP లే అవుట్ అమ్మకానికి కలదు. ఫోన్ : 94936 32727 [V-1912]

TO-LET
■ RTC అమలాపురం బస్టాండ్ ఆవరణలో (సైకిల్ స్టాండ్ ప్రక్క నుంచి) డిపో మేనేజర్ ఆఫీస్ ప్రహరీగోడ దగ్గర వరకు ఉన్న 100x75 అ॥ ఖాళీ స్థలం (విడిగా) అద్దెకు కలదు. Cont : 98854 56855 [R-1180815]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2401]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ రాజమండ్రిలో అమెజాన్ ప్రొడక్ట్స్ డెలివరీ చేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను. జీతం :13,000+పెట్రోల్ ఇవ్వబడును. ఆండ్రాయిడ్ ఫోన్ బైక్ లైసెన్స్ కావలెను. ✆ : 095531 38616, 091333 81333 [R-5888]

■ ఫ్రాంచైజ్ ఆఫర్ (పెట్టుబడి లేదు) మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి మాత్రమే ఫ్రాంచైజ్ ఇవ్వబడును. Mega Group Man Power & Security. Cont : 7032610569, 7093125169. [NA-5635]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995374999 [HA-208]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221307]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786362]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 9000408325 [G-786375]

■ శ్రీ సాయిరాం హోమ్‌కేర్ Hyd లో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసుకొనుటకు స్త్రీ/పు. కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. ఫోన్ : 9888001826, 9888001827 [H-781432]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సం.ల మహిళలు/మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+భోజనం+ జీతం: 16000-30000 వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్: 7799087387. [H-781493]

■ రాజమండ్రి, అనపర్తి, అమలాపురం, మురారిల్లో ప్ర॥ కం, ATM's, చెక్ పోస్ట్స్ నందు సెక్యూరిటీగార్డ్స్, సూపర్‌వైజర్స్ కావలెను.జీ॥ 10 వేలు to 15 వేలు రూం + భో, రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 & 93979 10369 [R-10]

■ Wanted teachers for (NS/Eng. High School, Elementary Maths) Sal : 12000-18000 and negotiable Qualification : any Degree or B.Tech., Contact Prakasham EM High School Madhuranagar Kakinada ✆ : 9948881449, 6302305325, 8247034456 [R-1806]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేసవి వేడి.. కొండెక్కిన కోడి

- బ్రాయిలర్ హోల్‌సేల్ ధర రూ.162
- చికెన్ రూ.300 పైమాటే
- వేసవి ప్రభావంతో తగ్గిన కోళ్ల సరఫరా


పెదపళ్లలోని బ్రాయిలర్ కోళ్ల ఫారం

ఆలమూరు: బ్రాయిలర్ కోడి ధర కొండెక్కి కూర్చుంది. రికార్డు స్థాయిలో రెండేళ్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో మాంసాహార ప్రియులు ధరలు చూసి బెంబేలెత్తి పోతున్నారు. ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహారులకు పెరిగిన ధర మింగుడుపడటం లేదు. సాధారణంగా ప్రతి రోజూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 400 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల సరఫరా జరగుతుంది. కోళ్ల ఉత్పత్తి మందగించడంతో ఏర్పడిన కొరత దృష్ట్యా వారం రోజుల నుంచి తుని, రాజమహేంద్రవరం తణుకులోనున్న కోళ్ల ఉత్పత్తి కంపెనీలు, రైతుల నుంచి కేవలం 250 టన్నుల వరకూ మాత్రమే సరఫరా జరగుతోంది. వేసవి ప్రభావం దృష్ట్యా కోళ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో పాటు ఎండ తీవ్రతను తట్టుకోలేక అనునిత్యం వేలాది కోళ్ల మృత్యువాత పడటం ఈ ధరలు పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. మూడు నెలల నుంచి చికెన్ ధరలు రూ.100 లోపే ఉండటంతో నష్టాలు తట్టుకోలేని రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. దీంతోపాటు వేసవి ప్రభావాన్ని ముందే ఊహించిన కొంతమంది కోళ్ల పెంపకాన్ని తగ్గించడంతో ఉత్పత్తి మందగించింది. కంపెనీల నుంచి స్థానిక హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా దారులు రూ.150 ధర నిర్ణయించగా, రిటైలర్లకు రూ.165 వరకూ విక్రయిస్తున్నారు.

చికెన్ ధర పెరిగినా తగ్గని విక్రయాలు

బహిరంగ మార్కెట్లో బ్రాయిలర్ కోడి కేజీ హోల్‌సేల్ ధర రూ.170 కాగా చికెన్ కేజీ రూ.300, బోన్‌లెస్ రూ. 400 వరకూ విక్రయిస్తున్నారు. కోళ్ల కొత్త బ్యాచ్‌లు వచ్చే వరకూ మరో నెల రోజుల వరకూ ఇంచుమించు ఇదే ఇవే ధరలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చికెన్ ధర ఆశాజనకంగా ఉండటంతో స్థానిక రైతులు వారం రోజుల నుంచి కోళ్ల ఫారంలో ఉన్న కోళ్లలో కేజీన్నర దాటిన వాటిని విక్రయించే పనిలో పడ్డారు. ఇప్పుడు ఆ బ్రాయిలర్ కోళ్ల సరఫరా అంతంగా మాత్రంగానే ఉండటంతో చికెన్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. చికెన్ ధరలు పెరుగుతున్నా విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. స్థానికంగా ఎండల నుంచి ఉపశమనాన్ని పొందే విధంగా చర్యలు తీసుకుని కోళ్ల పెంపకం సాగిస్తున్న చిన్నకారు రైతులకు మాత్రం ఈ ధర అమాంతం లాభాలు తెచ్చి పెడుతోంది.

ఉష్ణోగ్రతల ప్రభావంతోనే చికెన్ ధర పెరిగింది



వేసవి దృష్ట్యా రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల చికెన్ ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో వేడిమిని తట్టుకోలేక కోళ్ల ఫారాల్లో రోజూ సరాసరి వందలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. పెరిగిన ధరలలోను రైతులు నష్టాలను చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ ధరలు జూన్ నెలాఖరు వరకూ కొనసాగే అవకాశం ఉంది.

– బొబ్బా వెంకన్న, హోల్‌సేల్ కోళ్ల వ్యాపారి, పెదపళ్ల

పిడుగు పడి పాడి గేదెల మృతి


మృతిచెందిన గేదెలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి రెండు పాడి గేదెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తన పాడి గేదెలను పొలంలో మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన మెరుపులు వచ్చి పిడుగుపడడంతో పొలంలో మేస్తున్న రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందినట్టు చిన జగ్గంపేటకు చెందిన రైతు వమ్మి దొంగబ్బాయి తెలిపారు. వర్షం వస్తుందని తాను చెట్టు నీడకు వెళ్లిపోవడంతో పిడుగు నుంచి తాను తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. గేదెల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఉత్కంఠగా రగ్బీ పోటీలు

పిఠాపురం: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి స్త్రీ, పురుష క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు తలపడిన జట్ల మధ్య పోటీ ఉత్కంఠ భరితంగా జరిగింది. రెండో రోజు ఆదివారం పోటీలలో పురుషుల విభాగంలో తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాలు...మహిళల విభాగంలో విజయనగరం, నెల్లూరు జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నట్లు నిర్వాహకుడు లక్ష్మణరావు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవదాయ - ధర్మదాయ శాఖ, విజయవాడ.

ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఈ దిగువ సుదహరించిన పనులకు టెండరు పిలువుట జరుగుచున్నది.

క్రమ సంఖ్య	పని వివరము	అంచనా విలువ
1	శ్రీ సీతారామ స్వామి దేవాలయము, సీతానగరం గ్రామము మరియు మండలం,తూర్పు గోదావరి జిల్లా నందు దేవాలయమును పునర్నిర్మించుటకు	రూ.80.00లక్షలు
2	శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయము,కాటవరం గ్రామము సీతానగరం మండలం,తూర్పు గోదావరి జిల్లా నందు దేవాలయమును పునర్నిర్మించుటకు	రూ.75.00లక్షలు

ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

కార్యనిర్వహణాధికారి